

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

# సైనికుల్లా.. పని చేయండి

**బీఆర్‌ఎస్ శ్రేణులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపు**

**పార్లమెంట్ పరిధిలోని 200 మంది బీఎస్పీ నాయకులు**

**బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక**

**గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే యాదయ్య, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**

షాబాద్, ఏప్రిల్ 9: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల స్థానాన్ని దక్కించుకునేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే యాదయ్య, బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన సుమారు 200 మంది బీఎస్పీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఏండ్లు సుదీర్ఘ పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. పదేండ్ల కాలంలో అన్ని వర్గాలకూ పెద్దపీట వేశారన్నారు. బీఎస్పీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి పెద్ద ఎత్తున చేరడం సంతోషకరమన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జిల్లా పరిషత్తు చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పని చేశారన్నారు. ఈ నెల 13న చేవెళ్లలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సభ ఉన్నదని, పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా తనకు కేసీఆర్ అవకాశం ఇచ్చారని, మీరందరూ ఆశీర్వదించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గత 40 ఏండ్లుగా కృషి చేస్తున్నానని తెలిపారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభకు భారీగా తరలిరావాలని కోరారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో అండగా నిలిచిన వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో పదవులు అనుభవించి బయటకు వెళ్లిన వారికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు అందరూ కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, ఆయా నియోజకవర్గాల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న బీఎస్పీ నాయకులు


నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, బుధవారం 10 ఏప్రిల్ 2024 | VIKARABAD




మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా అర్చకులు రంగరాజన్ పంచాంగ పఠనం చేశారు. క్రోధి నామ సంవత్సరంలో ఎలా ఉండబోతుందో తెలియజేశారు. అనంతరం ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.
- మొయినాబాద్



కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం

# ఎమ్మెల్యేలకు టెన్షన్

**అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గినా..**

**పార్లమెంటు ఎన్నికలకు మారిన పరిస్థితి**

**ఓటింగ్ సరళి తారుమారయ్యే అవకాశం**

**హామీల అమలులో విఫలం కావడంతో ప్రజల్లో ఆగ్రహం**

**నియోజకవర్గాల సమావేశాల్లోనూ సొంత పార్టీ అభ్యర్థిని నిలదీస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు**

**మొన్నటి వరకూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేసిన రంజిత్‌రెడ్డిని ఎలా గెలిపించాలని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ క్యాడర్**

వికారాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలుగా గెలిచిన ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలకు చేవెళ్ల పార్లమెంట్ ఎన్నిక సవాల్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో వచ్చిన మెజార్టీ రాకపోతే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కోసం పనిచేయలేదనే ప్రచారం జరుగుతుందని ముందే గుర్తించిన జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల నాయకులు, క్యాడర్‌ను బతిమిలాడుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పరిస్థితి వేరు, పార్లమెంట్ ఎన్నికల్లో పరిస్థితి వేరు కావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎంత శ్రమించినా.. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీలో సగం ఓట్లు కూడా వచ్చే అవకాశం లేదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పనిచేసిన ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండడమే ఇందుకు ఓ కారణంగా చెప్పవచ్చు. రంజిత్‌రెడ్డి గెలిపించిన పార్టీకి ద్రోహం చేసి పార్టీ మారడంతోపాటు ఎంపీగా ఉండి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిందేమీ లేకపోవడంతో ఆగ్రహంతో ఉన్న ప్రజలు మెజార్టీనివ్వడం కాదు.. ఓడించేందుకు సిద్ధమైనట్లు జిల్లా అంతటా ప్రచారం జరుగుతున్నది. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన సీఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ ఓటమి ఖాయమని అన్ని సర్వేల్లోనూ తేలడంతోనే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో రంజిత్‌రెడ్డి ఓటమి ఖాయమని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నట్లు సమాచారం.

### రంజిత్‌రెడ్డి భంగపాటు తప్పని పరిస్థితి...

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తేనే గెలుస్తానని ముందే ఊహించుకొని పార్టీ మారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో భంగపాటు తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించే బాధ్యతను రంజిత్‌రెడ్డి తీసుకొని పనిచేశారు. ముఖ్యంగా వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించి అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌ను ఇబ్బందులుపెట్టారు. అయినప్పటికీ వికారాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిపై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు 12 వేల ఓట్లకు పైగా మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఇందులో సగం ఓట్లు కూడా రావడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### రంజిత్‌రెడ్డిని నిలదీస్తున్న సొంత పార్టీ శ్రేణులు

ఆయా నియోజకవర్గాల సమావేశాల్లోనూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ఆ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు నిలదీసినట్లు తెలిసింది. నాలుగు రోజుల క్రితం వికారాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంజిత్‌రెడ్డి సమావేశమయ్యారు. సమావేశం ప్రారంభంలోనే రంజిత్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు గట్టిగా నిలదీసినట్లు సమాచారం. ప్రసాద్‌కుమార్‌ను ఓడించేందుకు పనిచేసిన ఆయనతో పనిచేయబోమని, తమపై కేసులు పెట్టి ఇబ్బంది పెట్టిన సంగతి ఇంకా మరువలేదని.. రంజిత్‌రెడ్డి గెలుపు కోసం పనిచేయడం తమవల్ల కాదంటూ కాంగ్రెస్ నాయకులు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముందే తెగేసి చెప్పినట్లు తెలిసింది. ఒకరిద్దరు నాయకులయితే అసభ్యపదజాలంతో మాట్లాడినట్లు సమాచారం. దీంతో స్పందించిన కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డి మా ఇంటికి వచ్చి పార్టీలో చేరి, పోటీ చేయాలని అడిగితేనే పార్టీలోకి వచ్చినట్లు చెప్పడంతో గొడవ సద్దుమణిగినట్లు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలంటూ రంజిత్‌రెడ్డి బతిమిలాడి ప్యాకేజీలిచ్చినా కాంగ్రెస్ నాయకులు మాత్రం పైకి మీ గెలుపు కోసం పని చేస్తామని చెబుతున్నా.. లోలోపల వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. రంజిత్‌రెడ్డిని ఓడించడం ఖాయమనే గుసగుసలు వినిపిస్తుండడం గమనార్హం.

### తలనొప్పిగా మారిన వర్గపోరు

తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్‌లోనూ పాత, కొత్త క్యాడర్‌ల వర్గపోరుతో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తలనొప్పిగా మారింది. ఇటీవల క్యాంప్ కార్యాలయంలో తమకు సమాచారం ఇవ్వడం లేదు, పట్టించుకోవడం లేదంటూ రెండు వర్గాలుగా చీలిపోయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది. పార్లమెంట్ ఎన్నికలేమో కానీ ఈ గొడవలను సద్దుమణిగించడమే ఎమ్మెల్యేకు పెద్ద కష్టంగా మారింది. అదే విధంగా కాంగ్రెస్ పార్టీలో చేరి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పట్నం కుటుంబం కూడా రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారానికి దూరంగా ఉండడం ఖాయమని వినిపిస్తున్నది. మల్కాజిగిరిని సాకుగా చూపెడుతూ తాండూరు నియోజకవర్గంతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టున్న పట్నం మహేందర్‌రెడ్డి రంజిత్‌రెడ్డి గెలుపునకై సహకరించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణాలతో రంజిత్‌రెడ్డికి భంగపాటు తప్పదనే ప్రచారం జోరందుకున్నది.



**లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కార్యక్షేత్రంలోకి దిగనున్న గులాబీ దళం**

# ప్రజలతో మమేకమయ్యేలా..

- **ఇప్పటివరకు నియోజకవర్గాలవారీగా సమీక్షలు, సన్నాహక సమావేశాల నిర్వహణ**
- **ఇకపై ప్రజాక్షేత్రంలో ప్రచార పర్వాన్ని హోరెత్తించనున్న బీఆర్‌ఎస్ పార్టీ**
- **ఈ నెల 13న చేవెళ్లలో కేసీఆర్ భారీ బహిరంగ సభ**
- **ఆ తర్వాత రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించేలా కార్యాచరణ**


రంగారెడ్డి, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ముందుకు సాగుతున్నది. జనరల్ స్థానమైన చేవెళ్లను గతంలో రెండు పర్యాయాలు కైవసం చేసుకున్న బీఆర్‌ఎస్ మూడోసారి సైతం గెలుచుకునేలా వ్యూహ రచన చేస్తున్నది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల్లో సమీక్షలు, సన్నాహక సమావేశాలు నిర్వహించి పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేశారు. ఇక ప్రజా క్షేత్రంలో ప్రచార పర్వాన్ని హోరెత్తించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సన్నద్ధమవుతున్నది. ఈ నెల 13న చేవెళ్లలో కేసీఆర్ భారీ బహిరంగ సభ తర్వాత పార్టీ శ్రేణులు మరింత దూకుడుగా వ్యవహరించనున్నాయి. ఐదు పార్లమెంటు స్థానాలు రంగారెడ్డి జిల్లాకు అనుబంధంగా ఉండడంతో రాబోవు రోజుల్లో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించి ప్రజలతో మమేకం అయ్యేలా రూట్ మ్యాప్‌ను రూపొందిస్తున్నట్లు తెలిసింది.

### ప్రజల్లోకి కాంగ్రెస్ వైఫల్యాలు

చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ అధినేత కేసీఆర్ బరిలో నిలిపారు. ఇతర పార్టీలకు భిన్నంగా జనరల్ స్థానంలో బీసీ అభ్యర్థిని వ్యూహాత్మకంగా కేసీఆర్ ప్రకటించారు. ఇప్పటికే ఎంపీ అభ్యర్థి కాసానితో చేవెళ్ల పార్లమెంటు పరిధిలో నియోజకవర్గాలవారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు పలు దఫాలుగా సమీక్షలు, సమావేశాలను నిర్వహించారు. స్థానిక మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేవెళ్ల ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. సమీక్షలు, సన్నాహక సమావేశాలు పూర్తవడంతో ఇకపై ఎన్నికల ప్రచారంపై నేతలు దృష్టి సారిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా పార్లమెంటు ఎన్నికల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ప్రజలతో మమేకమయ్యేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ముఖ్యంగా అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. వంద రోజుల పాలనలో ఎన్నికల నాటి హామీలను నెరవేర్చకపోవడం.. ఈ కొద్దిరోజుల్లోనే ఏయే వర్గాలు నిర్వీర్యమయ్యాయి? ఏయే వర్గాలు ఎలా నిర్లక్ష్యానికి గురయ్యాయి? అనే అంశాలను కూలంకుశంగా ప్రజలకు వివరించనున్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రజల నుంచి మూటగట్టుకున్న అసంతృప్తిని పార్లమెంటు ఎన్నికల్లో అనుకూలంగా మలుచుకునేలా బీఆర్‌ఎస్ పార్టీ వ్యూహ రచన చేస్తున్నది.

### కేసీఆర్ రాకతో ప్రచార వేడి

ఈ నెల 13న చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహిస్తుండగా.. కేసీఆర్ ఈ సభకు హాజరవుతున్నారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న సభ కావడంతో నేతలు ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. ఈ నెల 6న కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడ వేదికగా నిర్వహించిన సభకు రాహుల్‌గాంధీతోపాటు రాష్ట్రస్థాయి నేతలు హాజరైనప్పటికీ సభ చెప్పుకోదగ్గ రీతిలో సక్సెస్ కాలేదు. ప్రజా పాలనను గాలికొదిలేసిన కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతున్న తరుణంలో నిర్వహించిన ఈ సభకు వచ్చిన జనంలోనూ ఏమాత్రం జోష్ కనిపించలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో కేసీఆర్ పాల్గొంటున్న చేవెళ్ల సభను గ్రాండ్ సక్సెస్ చేసి పార్టీ శ్రేణులతోపాటు జనంలోనూ కొత్త జోష్ తీసుకొచ్చేలా బీఆర్‌ఎస్ పార్టీ ప్లాన్ చేస్తున్నది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు ఛాయలు నెలకొనగా రైతులకు బాసటగా ఇటీవల కేసీఆర్ జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. జనగామ, సూర్యాపేట, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో పర్యటించి ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారు. కేసీఆర్ పర్యటన పట్ల ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండడంతో పార్లమెంటు ఎన్నికల్లో ఎక్కువగా ప్రజల మధ్యన ఉండేలా కేసీఆర్ ప్రచారంపై పార్టీ శ్రేణులు దృష్టిని కేంద్రీకరించాయి. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, భువనగిరి, మల్కాజిగిరి లోక్‌సభ పార్లమెంటు పరిధిలో రంగారెడ్డి జిల్లాలోని నియోజకవర్గాలు ఉండడంతో రాబోవు రోజుల్లో అన్ని నియోజకవర్గాలను కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చుట్టివచ్చేలా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించేందుకు రూట్ మ్యాప్‌ను సైతం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. కేసీఆర్ పాల్గొనే చేవెళ్ల సభ తర్వాత ప్రచారం వేడెక్కనున్నదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ క్యాడర్ బలమేమిటో, సత్తా ఏమిటో చూపిస్తామని బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు.





అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ యాదమ్మనగర్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్(మాజీ ఐపీఎస్)ను సన్మానిస్తున్న ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

# కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తాం

**నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్**

మల్కాజిగిరి, ఏప్రిల్ 9: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామని బీఆర్‌ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ యాదమ్మనగర్‌లో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుపడచడంలో విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా బీఆర్‌ఎస్ పార్టీపై తప్పుడు ఆరోపణలను చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మరని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి తప్పుచేశామని ప్రజలు అంటున్నారని చెప్పారు. మల్కాజిగిరి ఎంపీగా రేవంత్ రెడ్డి గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సబితాకిశోర్, అనిల్‌కిశోర్, ప్రభాకర్, శివ, రాజు, బచ్చల స్వామి, చంద్రశేఖర్, సురేశ్, బాబు పాల్గొన్నారు.

# ఉగాది వేళ ఉపశమనం

**తగ్గిన భానుడి ప్రతాపం**

బొంరాస్‌పేట, ఏప్రిల్ 9 : గత వారం రోజులుగా నిప్పుల కుంపటిని తలపించిన ఎండ తీవ్రత మంగళవారం జిల్లావ్యాప్తంగా తగ్గడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. వారం రోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం సాయంత్రం నుంచే చల్లటి గాలులు వీచాయి. మంగళవారం ఉదయం కూడా కొంచెంసేపు ఎండనే లేదు. ఆ తరువాత ఎండ ఉన్నా చల్లటి గాలులు వీచాయి. మరో రెండు రోజులు ఎండ తీవ్రత తక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో ప్రజలకు ఉపశమనం కలిగింది. వారం రోజుల నుంచి 40 డిగ్రీలకు పైగా నమోదైన ఉష్ణోగ్రతలు మంగళవారం 37 డిగ్రీలు నమోదైంది.